అక్క చెల్లెమ్మలకు ఆర్థిక చేయూత

- మహిళలకు అండగా 'ఆసరా'
- నాలుగు విడతల్లో రుణమాఫీ



వైఎస్సార్ ఆసరా కార్యక్రమానికి హాజరైన మహిళలు (ఫైల్)

మండలం	సంఘాలు	సభ్యులు	లబ్ధి (రూ.కోట్లలో)
మొగల్తూరు	1,566	15,660	రూ.68.48
నరసాపురం	1,580	15,805	రూ.63.20

నరసాపురం రూరల్: గత ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్లుగానే అధికారంలోకి వచ్చిన తరువాత డ్వాక్రా సంఘాల రుణ భారాన్ని తగ్గించేందుకు వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దక్కింది. ఆర్థిక సాధికారతే లక్ష్యంగా ఇప్పటికే మహిళలకు అనేక పథకాలు అందిస్తూ మహిళా పక్షపాతిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు తెచ్చుకున్నారు. సామాజిక, రాజకీయంగా వారిని బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టడంతో పాటు అమలు చేసి చూపుతున్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా డ్వాక్రా రుణాల మాఫీని ఆసరా పేరిట వాయిదాల ప్రకారం సకాలంలో సంఘాలకు అందించారు. అంతేకాక సకాలంలో సంఘాలకు రుణాల పంపిణీ, పావలా వడ్డీ ప్రభుత్వం విడుదల చేస్తోంది. ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో విడుదల చేసిన ఆసరా నగదు డ్వాక్రా మహిళలకు ఎంతగానో ఉపయోగపడింది. 2019 ఏప్రిల్ 11 నాటికి రాష్ట్రంలోని డ్వాక్రా సంఘాలకు ఉన్న రుణం మొత్తాన్ని రద్దు చేస్తామని ఎన్నికల హామీలో ప్రకటించిన ప్రకారం మాట తప్పకుండా అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుంది. గతంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత బుట్టదాఖలు చేసిన ప్రభుత్వాలు ఎన్నో ఉన్నాయి. కానీ సీఎం వైఎస్ జగన్ మాత్రం అమలు చేసి చూపి మహిళల ఆదరణ పొందారు. ఈ ప్రభుత్వంలో ప్రత్యేకంగా పిల్లల నుంచి పెద్ద వాళ్ళదాకా వివిధ సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ, కిశోర బాలికలకు నాప్‌కిన్స్ పంపిణీ, మహిళల భద్రత కోసం దిశ యాప్, జగనన్న అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ కాపునేస్తం, వైఎస్సార్ ఈబీసీ నేస్తం, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన పథకాలు అందిస్తూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా అమలు చేస్తున్నారు. ఆసరా సొమ్ము జమ కావడంతో పూర్తిగా ప్రభుత్వ సాయం అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మహిళలు ముక్తకంఠంతో అభినందిస్తున్నారు. ప్రభుత్వ పథకాలపై మహిళలకు అవగాహన కల్పించడమే కాక డ్వాక్రా గ్రూపుల్లో లేని మహిళలను గుర్తించి వారు కూడా గ్రూపులో చేరేలా ప్రోత్సహిస్తూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వ పరంగా ఎంతగానో కృషి చేస్తున్నారు.

చిల్లర కొట్టు పెట్టుకున్నా



నేను డ్వాక్రా గ్రూపులో సభ్యురాలిగా చాలా కాలంగా ఉన్నాను. గతంలో రుణం తీసుకుంటే తిరిగి కట్టడానికి మాత్రమే అవి సరిపోయేది. సీఎం జగన్ దయ వల్ల వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మా గ్రూపునకు రూ.2.44 లక్షలు రుణ మాఫీ అయ్యింది. నాలుగు విడతలుగా, విడతకు రూ.6,100లు రుణమాఫీ అయ్యింది. వాటికితోడు నాకు వితంతు పింఛన్ ప్రతినెలా రూ.3 వేలు, చేయూత రూ.18,750లు నాకు అందాయి. వీటితో మా కుమార్తెతో కలసి ఇంటి వద్ద చిల్లర కొట్టు పెట్టుకుని గౌరవంగా జీవనం సాగిస్తున్నాం. దీంతో వ్యాపారం కోసం ఇప్పుడు అధిక వడ్డీలకు డబ్బులు తీసుకోవాల్సిన అవసరం లేక పోయింది.

– ముప్పిరి సుందరమ్మ, సీతారాంపురం సౌత్, నరసాపురం మండలం

అన్నలా ఆదరిస్తున్నాడు



నా పేరు ఆకుల సరస్వతి, నరసాపురం మండలం రుస్తుంబాద, యడ్లపల్లివారితోటలో ఉంటాం. నాకు ఇద్దరు కుమార్తెలు, భర్త ప్రైవేటు జాబ్ చేస్తుంటారు. లక్ష్మీదుర్గ గ్రూపు సభ్యురాలిగా ఉన్నా మాకు 2019లో రుణమాఫీ జరిగింది. మాకు రూ.10,500లు చొప్పున నాలుగేళ్లపాటు జమ అవుతుంది. మా అమ్మాయికి అమ్మఒడి పథకంతో పాటు నాకు రైతు భరోసా కూడా పడుతుంది. తోడు పథకం ద్వారా రుణం కూడా తీసుకుంటున్నాను. ఈ పథకాలన్నీ కుటుంబ సోషణకు చేదోడుగా ఉంటున్నాయి. ఆర్థికాభివృద్ధి కోసం జగన్ చేస్తున్న కృషి మరువ లేం. అన్నలా ఆదరిస్తున్న ఆయనకు అండగా ఉంటాం.

– ఆకుల సరస్వతి, రుస్తుంబాద, నరసాపురం మండలం

పాడి గేదెను కొనుక్కున్నాం



వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మా గ్రూపునకు రూ.52 వేలు రుణ మాఫీ అయ్యింది. మాకు ఒక్కొక్కరికి సంవత్సరానికి రూ.1,300లు చొప్పున నాలుగేళ్లకు గానూ రూ.5,200లు వచ్చింది. దీనికి తోడు మా బాబు చదువు నిమిత్తం అమ్మ ఒడి కూడా పడుతోంది. మా గ్రూపు ద్వారా నేను శ్రీనిధి రుణం రూ.45 వేలు తీసుకుని పాడి గేదెలను కొనుక్కుని మేపుకుని పాలు అమ్ముకుని ఆర్థికంగా నిలదొక్కు కున్నాం. సీఎం జగన్ పొదుపు సంఘాల్లో ఉన్న మాకు రుణ మాఫీ చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు.

– సిర్రా చిన్నారి, సరిపల్లి

క్లుప్తంగా

నాగరాజు సేవలు ఎనలేనివి

పెనుగొండ: పెనుగొండ ఏఎంసీలో ఏఎంఎస్‌గా విధులు నిర్వహిస్తున్న పి.నాగరాజు సేవలు మరువలేనివని ఏఎంసీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ టీసీ రామాంజనేయులు అన్నారు. పదోన్నతిపై ఏలూరు జిల్లా దెందులూరు ఏఎంసీ సూపర్‌వైజరుగా వెళుతున్న నాగరాజును బుధవారం పెనుగొండ ఏఎంసీలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజరు భాస్కరరాజు, నరసింహరావు, మూర్తి, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ రాష్ట్ర కార్యదర్శి కూనపరెడ్డి సుధాకర్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లబ్ డిప్యూటీ గవర్నర్‌గా కనకరత్నమాల

పెనుగొండ: ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్ 201కు డిప్యూటీ గవర్నర్‌గా భీమలాపురం వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు కొత్త కనకరత్నమాల నియమితులయ్యారు. బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఈ మేరకు గవర్నర్ వై.సత్యనారాయణ ఏలూరులో జరిగిన సమావేశంలో నియామక పత్రాలు అందించినట్లు వివరించారు. కనకరత్నమాలను పలువురు అభినందించారు.

పాలకవర్గ ప్రమాణ స్వీకారం

పెనుమంట్ర: జుత్తిగ గ్రామంలోని శ్రీ ఉమా వాసుకి రవి సోమేశ్వరస్వామి దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ట్రస్టు బోర్డు సభ్యులుగా వెలగల వెంకట సోమిరెడ్డి, చిలుకూరి విశ్వనాథం, గుత్తుల రేవతిస్వాతి, పాదిలపు వెంకటలక్ష్మి, కట్టుంగ నాగమణి, నక్కా సత్యవతి, కొండవీటి రామకృష్ణశర్మతో ఆలయ ఈవో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ తమనంపూడి వీర్రెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొవ్వూరి చిన్నారెడ్డి, నల్లమిల్లి విజయకుమార్‌రెడ్డి, గుడిమెట్ల సాయి మురళీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల నియోజకవర్గ కన్వీనర్‌గా అనురాధ

పెనుమంట్ర: ఆచంట నియోజకవర్గ వలంటీర్ల కన్వీనర్‌గా మార్టేరు గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు, మండల మహిళా సంఘం నాయకురాలు కర్రి అనురాధను నియమిస్తూ బుధవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశాలు జారీ చేశారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి కృషి చేయడమే కాకుండా మార్టేరు -2 ఎంపీటీసీ సభ్యురాలుగా ఎన్నికై పార్టీ బలోపేతానికి ఎంతగానో కృషి చేసిన అనురాధను నియమించడం పట్ల పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

రేపు పర్యావరణ విద్యపై పరీక్ష

పెనుగొండ: ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈనెల 23న పర్యావరణ విద్యపై పరీక్ష నిర్వహించనున్నట్లు పెనుగొండ ఎస్వీకేపీ అండ్ పితాని వెంకన్న జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొల్లి వెంకట రామ సూర్యనారాయణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తేనే ఇంటర్ పరీక్షలకు అర్హులవుతారని తెలిపారు. ఇంటర్ పరీక్షలు మార్చి 1 నుంచి ప్రథమ సంవత్సర విద్యార్థులకు, 2వ తేదీ నుంచి ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ప్రారంభమవుతాయని తెలిపారు.

నేడు వలంటీర్లకు సత్కారం

పాలకొల్లు అర్బన్: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు వలంటీర్లకు అభినందన సభ ఏర్పాటు చేసినట్లు మండల పరిషత్ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె.గోవిందరాజులు ఒక ప్రకటనలో తెలిపారు. పోడూరు, యలమంచిలి, పాలకొల్లు పట్టణ, మండలంలో పనిచేసిన వలంటీర్లకు వజ్ర, రత్న, సేవా మిత్ర అవార్డులు అందించనున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి), ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి, జెడ్పీటీసీ నడపన గోవిందరాజు చేతుల మీదుగా వలంటీర్లను సత్కరించనున్నట్లు ఆయన తెలిపారు.

వలంటీర్లు వారధులు

యలమంచిలి: వలంటీర్లు ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారధులుగా పనిచేస్తున్నారని కాజ పడమర సర్పంచ్ గుబ్బల వేణుగోపాలస్వామి అన్నారు. గ్రామానికి చెందిన వేండ్ర నాగ వెంకట సత్యనారాయణకు సేవా వజ్ర అవార్డు వచ్చిన సందర్భంగా బుధవారం సచివాలయం వద్ద ఘనంగా సన్మానించారు. వలంటీర్లు సేవాభావంతో అవినీతి రహితంగా పనిచేయడం వల్లే ప్రభుత్వానికి ప్రజల్లో ఆదరణ పెరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పాలా శారదా శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఒక సేవావజ్ర.. ఐదు సేవారత్నాలు

యలమంచిలి మండలంలోని 32 గ్రామాల్లో 328 మంది వలంటీర్లు పనిచేస్తుండగా, వారిలో ఒకరికి సేవా వజ్ర, ఐదుగురికి సేవా రత్న అవార్డులు రాగా, మిగిలిన 322 మంది సేవామిత్రలుగా ఎంపికయ్యారని ఎంపీడీవో పి.శ్రీనివాసరావు తెలిపారు. కాజ పడమర గ్రామానికి చెందిన వేండ్ర నాగ వెంకట సత్యనారాయణకు సేవావజ్ర అవార్డు రాగా, సేవా రత్నాలుగా వాస్కూరి ఉషారాణి (ఇలపకుర్రు), కొయ్యే స్వప్న (కొంతేరు), విప్పర్తి ప్రసన్న (కట్టుపాలెం) జినిపే వరప్రసాద్ (బాడవ), మామిడిశెట్టి దేవి (బూరుగుపల్లి)లు ఎంపికయ్యారని ఆయన చెప్పారు. సేవా వజ్రకు రూ.45 వేలు, సేవా రత్నాలకు రూ.30 వేలు, సేవామిత్రలకు రూ.15 వేలు నగదు వారి ఖాతాల్లో జమ అవుతాయన్నారు.

వైభవంగా రమా సత్యనారాయణస్వామి కళ్యాణం

పోడూరు: కవిటం గ్రామంలో అతిరుద్ర యాగ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి శ్రీ రమా సహిత శ్రీ వీర వెంకట సత్యనారాయణస్వామి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి యాగ మహోత్సవాలకు విచ్చేసి కళ్యాణోత్సవాన్ని తిలకించారు. వైస్ ఎంపీపీ ఇందుకూరి సీతారామరాజు, రుద్రరాజు సూర్యనారాయణరాజు దంపతులు పీటలపై కూర్చుని కళ్యాణం జరిపించారు. బుధవారం వేద పండితులు గణపతి పూజ, రుద్రహోమం, ఈశ్వరునికి అభిషేకం, రుద్రక్రమార్చన, చండీహోమం, అరుణ హోమం తదితర పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జంధ్యాల శ్రీనివాస శర్మ, కర్రి శ్రీనివాసరెడ్డి, పడాల వెంకట సత్యనారాయణరెడ్డి, మండ కాశీవిశ్వనాథరెడ్డి, మేడపాటి రామచంద్రారెడ్డి తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

25న ఉచిత వైద్య శిబిరం

పాలకొల్లు సెంట్రల్: ఫెడరేషన్ ఆఫ్ క్షత్రియ సేవా సంఘం హైదరాబాద్, స్థానిక క్షత్రియ సంక్షేమ పరిషత్, అల్లూరి సీతారామరాజు సేవా సమితి సంయుక్త ఆధ్వర్యాన ఈనెల 25న ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు పట్టణ క్షత్రియ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు భూపతిరాజు విశ్వనాథరాజు తెలిపారు. క్షత్రియ కళ్యాణ మండపం వద్ద ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. ఎముకలు, నరాలు, గుండె, కిడ్నీ, ప్రసూతి, క్యాన్సర్, కంటి చికిత్సలకు సంబంధించిన వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో కనుమూరి రామకృష్ణంరాజు, కేఎస్వీఎస్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

బాలచందర్‌కు కళారత్న బిరుదు

పెనుగొండ: పెనుగొండ ఎస్వీకేపీ అండ్ పితాని వెంకన్న కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ బి.బాలచందర్‌ను రాజమహేంద్రవరంలో ఫిలాంత్రోపిక్ సొసైటీ, గ్లోబల్ క్రియేటివ్ ఆర్ట్ అకాడమీ అమెరికా, వైజ్మెన్ ఇంటర్నేషనల్, అంతర్జాతీయ కళావేదిక, తెలుగు భాషాభివృద్ధి సమితి సంయుక్తంగా కళారత్న బిరుదుతో సత్కరించాయి. ఈ మేరకు పెనుగొండలో బుధవారం డాక్టర్ బాలచందర్ విలేకర్లతో మాట్లాడుతూ మాతృభాషా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సభలో బీసీ సంక్షేమ సినిమాటోగ్రఫీ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, ఏపీ మీడియా అకాడమీ కార్యదర్శి ఎం.బాలంగాధర్ తిలక్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కుడుపూడి పార్థసారథి, తెలంగాణ కళాపరిషత్ అధ్యక్షుడు డాక్టర్ పగిడిపల్లి రాజారావు, ఫిలాంత్రోపిక్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అద్దంకి రాజా, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు నక్కా నగేష్, విజ్ఞాన్ వేదిక అధ్యక్షుడు చెరుకువాడ రంగసాయి చేతుల మీదుగా బిరుదును స్వీకరించినట్లు తెలిపారు. ఆయనను పలువురు అభినందించారు.

జుత్తిగలో మావుళ్లమ్మ వార్షికోత్సవాలు ప్రారంభం



మావుళ్లమ్మ అమ్మవారు

పెనుమంట్ర: జుత్తిగ గ్రామంలో వేంచేసియున్న శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి 18వ వార్షికోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు అమ్మవారికి వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించి 25న ఆలయ ఆవరణలో అఖండ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వహణ కమిటీ సభ్యుడు, గ్రామ సర్పంచ్ తమనంపూడి వీర్రెడ్డి తెలిపారు. ఉత్సవాలు ప్రారంభం సందర్భంగా అమ్మవారికి నిత్యార్చనలు చేసి, గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

వైఎస్సార్ సీపీ యలమంచిలి యూత్ కమిటీ ఎంపిక



కమిటీ సభ్యులను అభినందిస్తున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి

యలమంచిలి: కొంతేరు గ్రామంలో వైఎస్సార్ సీపీ మండల యూత్ కమిటీ అధ్యక్షుడు లంక చిరంజీవి అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో మండల యూత్ కమిటీని ఎంపిక చేశారు. ఉపాధ్యక్షులుగా వలవల ధర్మారావు, లంకే శ్రీను, ప్రధాన కార్యదర్శులుగా వలవల నరసింహమూర్తి, దొమ్మేటి శ్రీను, బోళ్ల మురళి, బద్దె నాని కార్యదర్శులుగా సిర్రా కిరణ్‌బాబు, గంధం శ్రీనివాస్, దీపాటి మధు, బొక్కా సూరిబాబు, రాపాక నారాయణ, గుబ్బల మణికంఠ, నాట్ర మహేష్, కాపా నాగన్న, సంయుక్త కార్యదర్శులుగా ఇల్లింగి నాగ శ్రీను, సంగటి సుబ్రహ్మణ్యం, ఖండవల్లి ప్రసాద్, పోతుమూడి కిషోర్, లంకే దుర్గారావు, దీపాటి శ్రీనివాస్, మోపిదేవి సర్వేశ్వరరావు, పాటి శ్రీను ఎంపికయ్యారు. సమావేశం అనంతరం కమిటీ సభ్యులంతా పాలకొల్లు వెళ్లి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)ని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నూతన కమిటీకి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు, సచివాలయ మండల కన్వీనర్ ఓదూరి భాస్కరరావు, ఎంపీపీ రావూరి వెంకటరమణ, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు వల్లభు సాయి వెంకట నరసింహారావు, రాష్ట్ర యువజన నాయకుడు ఉచ్చుల స్టాలిన్ శుభాకాంక్షలు తెలిపారు.

అన్నివర్గాలకూ సీఎం జగన్ అండ



తూర్పుపాలెంలో చెక్కును అందిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆచంట వేమవరంలో కర్ణోద్భవ కమ్యూనిటీ సేవా ట్రస్టు కల్యాణ మండపంపై అంతస్తు నిర్మాణానికి రూ.8.35 లక్షల చెక్కును సంఘ సభ్యులకు బుధవారం తూర్పుపాలెంలో జరిగిన కార్యక్రమంలో అందించారు. ప్రతి ఒక్కరూ సీఎం జగన్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జక్కంశెట్టి చంటి, ఉప సర్పంచ్ కొండేటి సురేష్‌బాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి కొడమంచిలి రాజు, సచివాలయ చైర్మన్ కోమటి సూరిబాబు, గుడాల చిరంజీవి, గుడిమెట్ల రామలింగం, తాళ్ల కుమార స్వామి, రుద్రాక్షల చిన రామలింగేశ్వరరావు, కండిబోయిన దుర్గాప్రసాద్, కండిబోయిన యువరాజు సేవా ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

స్థలం కేటాయింపు

పెనుగొండలో కాలభక్తుల సంఘ భవన నిర్మాణానికి స్థలం, నిధులు సమకూర్చడం జరుగుతుందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు భరోసా ఇచ్చారు. బుధవారం తూర్పుపాలెంలో సంఘ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలసి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ పాలపర్తి సుబ్రహ్మణ్యం, మండల కన్వీనరు నల్లిమిల్లి బాబిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు తిక్కరెడ్డి పవన్‌కుమార్‌లు పాల్గొన్నారు.

వలంటీర్లు జగనన్న రథసారథులు

రాష్ట్రంలో వలంటీర్లు సీఎం జగనన్న పాలనకు రథసారథులని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. బుధవారం తూర్పుపాలెంలో కొడమంచిలికి చెందిన వలంటీర్లు మర్యాదపూర్వకంగా కలిసి సేవా పురస్కారాలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు



మహిళకు బ్రోచర్‌ను అందిస్తున్న గుడాల గోపి

పాలకొల్లు అర్బన్: ఇంటింటికీ సంక్షేమ ఫలాలను అందించిన సీఎం జగన్‌కు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కోరారు. పాలకొల్లు 22వ వార్డులో బుధవారం 'జగనన్నతో జనం ... గోపన్నతో మనం' కార్యక్రమాన్ని నిర్వహించారు. గోపి ఇంటింటికీ వెళ్లి నవరత్నాల బ్రోచర్‌ను ప్రజలకు అందించి మరోసారి సీఎం జగన్‌కు అవకాశం ఇస్తే విద్య, వైద్యరంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువస్తారని చెప్పారు. సీఎం జగన్ 57 నెలల పరిపాలనలో సంక్షేమ ఫలాలను ఇంటికి పంపించారన్నారు. అలాగే ప్రభుత్వ వైద్యుడ్ని ఇంటికి పంపించి పేదలకు వైద్యం చేయించారన్నారు. ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చారన్నారు. చదువుకుంటే దేశం ప్రగతి సాధిస్తుందనే లక్ష్యంతో ప్రతి విద్యార్థికి విద్య అందించడానికి అనేక సంస్కరణలు అమలు చేశారని గోపి వివరించారు.

దిమ్మలు కట్టి ప్రజాధనం దుర్వినియోగం


పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల హయాంలో అభివృద్ధి పనుల పేరుతో శిలాఫలకాలు వేసి ప్రజాధనం దుర్వినియోగం చేశారని గోపి దుయ్యబట్టారు. ఎమ్మెల్యే నిమ్మలకు అభద్రతా భావం పట్టుకుందని ఓటుకు రూ.3వేలు, రూ.5వేలు ఇస్తారంటూ తనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. నీతివంతమైన, నిజాయితీ రాజకీయాలు చేయాలని హితవు చెప్పారు. సామాజిక సమీకరణల్లో భాగంగా సీఎం జగన్ బీసీ సామాజిక వర్గానికి చెందిన తనకు పాలకొల్లు అసెంబ్లీ, అలాగే భీమవరం ప్రాంతానికి చెందిన గూడూరి ఉమాబాలకు నరసాపురం ఎంపీ టికెట్ ఇచ్చి దళిత, బహుజనులకు అగ్రతాంబూలం ఇచ్చారన్నారు.

దమ్మయ్య, బెజవాడు కోడులకు శాశ్వత పరిష్కారం

వార్డు పర్యటనలకు వెళుతున్న తనకు ప్రజలు ప్రధానంగా డ్రెయినేజీ సమస్యలను వివరిస్తున్నారని గోపి చెప్పారు. పట్టణ ప్రజలను పీడిస్తున్న దమ్మయ్య పత్తి, బెజవాడ కోడులకు శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేసి మురుగు సమస్య పరిష్కరిస్తానన్నారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ సాలా దేవి, మండల పరిషత్ మాజీ ప్రతిపక్ష నేత చిట్టూరి ఏడుకొండలు, పార్టీ నాయకులు అడబాల వెంకటరమణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దా చంద్రకళ, జేసీఎస్ జిల్లా అధికార ప్రతినిధి ఖండవల్లి వాసు, జేసీఎస్ పట్టణ కన్వీనర్ మోర్త గిరీష్, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, వార్డు ఇన్‌చార్జ్ పిల్లా శ్రీనివాస్, వార్డు నాయకులు యాదంరెడ్డి శ్రీనివాస్, కుసుమే ఝాన్సీ హేమలత, పిల్లా అప్పాజీ, అల్లం మురళి, ఆలయాల చైర్మన్‌లు కోరాడ శ్రీనివాస్, జోగి వెంకటేశ్వరరావు, నంబూరి శ్రీగంగా పవన్, మామిడి బాబు, యలమంచిలి, పాలకొల్లు సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు వల్లభు నరసింహారావు, గుమ్మాపు పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

దళితులపై పవన్ సవతి తల్లి ప్రేమ

రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనంద ప్రకాష్



మాట్లాడుతున్న ఆనంద ప్రకాష్

పాలకొల్లు అర్బన్: జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ దళితులపై సవతి తల్లి ప్రేమ ఒలకబోస్తున్నారని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనంద ప్రకాష్ విమర్శించారు. పాలకొల్లులోని ఏఎంసీ అతిథి గృహంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భీమవరంలో పవన్ కల్యాణ్ కార్యకర్తల సమావేశంలో దళితుడైన తన కారు డ్రైవర్‌ని ఎమ్మెల్సీ అనంతబాబు హత్య చేయిస్తే సీఎం జగన్ అనంతబాబుకి అండగా నిలిచారని ఆరోపించడంలో నిజం లేదన్నారు. ఎస్సీ కమిషన్ సభ్యుడిగా రంపచోడవరం వెళ్లి అన్ని విషయాలను సేకరించామన్నారు. ఎమ్మెల్సీ అనంతబాబుని పోలీసులు అరెస్ట్ చేయడం, మూడు నెలలు జైలులో ఉండి బెయిల్‌పై బయటకు వచ్చారని వివరించారు. అయితే ఎన్నికల సమయంలో వైఎస్సార్ సీపీకి అండగా ఉన్న దళితులను పక్కదారి పట్టించడానికి దళితులపై ప్రేమ చూపించడం విడ్డూరంగా ఉందన్నారు. తన పార్టీ తరఫున గెలిచిన ఏకైక ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్‌ను పవన్ కల్యాణ్ పక్కన కూర్చోబెట్టుకోలేదని ఆనంద ప్రకాష్ ఆరోపించారు. సీఎం జగన్ తన పాలనలో దళితుల కుటుంబాల్లో వెలుగులు నింపారన్నారు. కుటుంబ విలువలు తెలియని పవన్ సీఎం జగన్ కుటుంబాన్ని విడదీసారని ఆరోపించడం సరికాదన్నారు. భీమవరంలో పవన్ కల్యాణ్‌కి మరోసారి ఓటమి ఖాయమని జోస్యం చెప్పారు. కేవలం 30 సీట్ల కోసం చంద్రబాబు పక్కన చేరి సీఎం జగన్‌ని ఓడిస్తానని పవన్ ఉత్తర కుమారుని ప్రగల్భాలు పలకడం విడ్డూరంగా ఉందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పోటీ చేసినా 2024 ఎన్నికల్లో జగన్ సునామీ రాబోతుందని ఆనంద ప్రకాష్ చెప్పారు.

మాతృభాష ఔనత్యాన్ని గుర్తించాలి



పాలకొల్లు జీవీఎస్‌వీఆర్ మున్సిపల్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

నరసాపురం: మాతృభాష ఔనత్యాన్ని గుర్తించాలని బీజీబీఎస్ మహిళా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని బుధవారం తెలుగు విభాగం ఆధ్వర్యాన నిర్వహించారు. ముందుగా తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లలకు మాతృభాష గొప్పతనాన్ని వివరించాలని చెప్పారు. ఇతర భాషలు నేర్చుకోవాలి కానీ మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. భాష అంటే సంస్కృతి అన్న విషయాన్ని గ్రహించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సి.సీరజ, తెలుగు హెడ్ చంద్రకళ, మధుషాలిని, పి.ఝాన్సీలక్ష్మి, పి.ప్రసన్న పాల్గొన్నారు.

మానవాళి వికాసానికి మాతృభాష

పాలకొల్లు సెంట్రల్: మానవాళి వికాసానికి, సంస్కృతీ సంప్రదాయాలను విస్తరించడానికి మాతృభాష మాత్రమే ముఖ్య భూమిక కాగలదని విశ్రాంత ఉద్యోగి, ప్రముఖ కవి కోలాటి పెద్దిరాజు అన్నారు. బుధవారం స్థానిక జీవీఎస్‌వీఆర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పలకలు అందజేశారు. పెద్దిరాజు మాట్లాడుతూ దేశభాషలందు తెలుగు లెస్స అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాయపూడి భవానీప్రసాద్, సామాజిక వేత్త నిట్టల శైలజ, ఉపాధ్యాయులు చంద్రకళ, శశికళ, భవానీదుర్గ, బి.త్రిమూర్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం

నరసాపురం రూరల్: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలను నరసాపురం మండలంలోని కాపులకొడప ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయిని ఉప్పుగంటి రాజశ్రీ విద్యార్థులకు వ్యవహారిక భాష గురించి గిడుగు రామమూర్తి పంతులు చేసిన కృషిని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాణి, సత్యనారాయణ, ఉపాధ్యాయులు చక్రధర్, వెంకటేశ్వరరావు, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

రోటరీ సేవలు అభినందనీయం

పాలకొల్లు సెంట్రల్: రోటరీ క్లబ్ గవర్నర్ జోన్‌లో పాలకొల్లు క్లబ్ అందించే సేవలు అభినందనీయమని క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రావూరి సుబ్బారావు దత్త అన్నారు. బుధవారం గవర్నర్ అఫీషియల్ విజిట్‌లో భాగంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్ కన్వెన్షన్ హాలులో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యంగా మైండ్ ఫీస్‌ఫుల్‌పై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని రోటరీ క్లబ్ నిర్ణయించడం జరిగిందన్నారు. నేడు ముఖ్యంగా విద్యార్థులు చిన్న వయస్సులోనే ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితులు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. పిల్లల్లో మైండ్ పీస్‌ఫుల్ అయ్యేలా అవగాహన సదస్సులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే చిన్నారులకు హార్ట్‌లో సమస్యలు ఉండి సర్జరీ అవసరమైతే రోటరీ క్లబ్ ద్వారా ఉచితంగా సర్జరీలు చేయించడం జరుగుతుందన్నారు.

పురుగు మందుల వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలి

మొగల్తూరు: చేలకు పురుగు మందులను వినియోగించే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ సూచించారు. బుధవారం మొగల్తూరు పంచాయతీ పాలకమ్మ చెరువు, నక్కావారిపాలెం, ఇంజేటివారిపాలెం తదితర ప్రాంతాల్లోని వ్యవసాయ భూములను పరిశీలించిన ఆయన మాట్లాడారు. గత రెండు మూడు రోజులుగా మంచు కురుస్తున్నందున ఎండ కాసే సమయంలో పురుగు మందులు వినియోగించాలన్నారు. పురుగు మందులు పిచికారీ సమయంలో ముక్కు, నోటికి గుడ్డ లేదా మాస్క్ ధరించాలన్నారు. పురుగు మందులను వినియోగించే సమయంలో రైతులకు అందుబాటులో ఉన్న రైతు భరోసా కేంద్రంలోని సిబ్బందిని లేదా వ్యవసాయ శాఖలోని తమను సంప్రదించి సలహాలు, సూచనలు పాటించాలన్నారు. ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గించి అధిక దిగుబడి సాధించాలని రైతులను కోరారు.